సాక్షి
జోగుళాంబ గద్వాల

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



రోడ్డు విస్తరణకు ఆటంకాలు

జడ్చర్ల మున్సిపాలిటీలోని సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణకు మళ్లీ ఆటంకాలు ఏర్పడ్డాయి.

వివరాలు 8లో ▸



ఇళ్ల కోసం ఎదురుచూపులు

ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /20.3

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మరింత ప్రభావం ఉంటుంది. రాత్రికి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కనులపండువగా ఆదిశిలావాసుడి కల్యాణం



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. పండితులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహాహోమంతోపాటు స్వామి వారి ఉత్సవ మూర్తులకు కల్యాం జరిపించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయచైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచ్చంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, దీరేంద్రదాసు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



అయిజ: దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలు పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ ఎప్పుడు దేశ ఐక్యతకు, దేశ భద్రతకు, దేశ సంస్కృతి కోసమే పనిచేస్తుందని, గ్రామాల బలోపేతానికి కృషిచేస్తుందని అన్నారు. నిరుపేదలను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద మెదటి విడతగా రూ.3500 వేల కోట్లు విడుదల చేసిందన్నారు. కానీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమల్లించిందని విమర్శించారు. గ్రామాల్లోని సర్పంచులకు నిధులు అందకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకొని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సరైన ప్రణాళిక లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.5లక్షల కోట్లు అప్పుచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పలకు పోవడం, సర్పంచుల పైన భారం పడటం చాలా బాధకారమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజలకు తెలియజేయాలని, బీజేపీ అభివృద్ధికి కృషిచేయాలని కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమసేనరావు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌ఓ) ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం ముషాయిరా అలరించింది. దాదాపు 73 మంది కవులు తమ కవితాగానం చేశారు. తెలుగులో, ఉర్దూలో పలువురు తమ కవితలు వినిపించారు. ప్రముఖ కవి లక్ష్మణ్‌గౌడ్ కవి సమ్మేళనం ముషాయిరాకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జైభారత్ సంఘం జాతీయ కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ధార్మిక గ్రంథాల్లో మత సామరస్యం గురించి ఉందని, మనిషి ప్రాధాన్యత నిత్యాయనే అన్నారు. ఏఐపీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాల్ మాట్లాడుతూ సమాజం జడత్వంలో ఉంటే జీవం పోసేది కవిత్వమే అన్నారు. 1952లో రెండో ప్రపంచ యుద్ధం విధ్వంసం, భయానక రక్తపాతాన్ని చూసిన ఆనాటి అభ్యుదయవాదులు, ప్రజాస్వామికవాదులు ప్రపంచ శాంతి సంఘాలను ఏర్పాటు చేశారని, అందులో భాగంగానే అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఏర్పడిందని గుర్తు చేశారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, యోగ విద్యాలయ ప్రొఫెసర్ సీఆర్ఎస్ ప్రభు, ప్రముఖ ఉర్దూ కవి నూర్ అఫాఖీ తదితరులు మాట్లాడారు.



మన్యంకొండ.. జనమే నిండా

వివరాలు 8లో..

- ఎటుచూసినా భక్తజన సందోహమే
- యాదగిరిగుట్ట నుంచి ప్రత్యేకంగా 13 బస్సుల రాక

– మహబూబ్‌నగర్ రూరల్

ఆశల పల్లకీలో..

- ఉమ్మడి పాలమూరులోని సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను
- ఏకకాల రుణమాఫీ కోసం అన్నదాతల ఎదురుచూపు
- నిధుల కొరతతో ముందుకు సాగని 'డబుల్' ఇళ్లు
- ప్రతిఏటా 'పీయూ'కు మొండిచెయ్యే
- నేటి రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో సోమవారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాదిలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యం.. కేసీఆర్ సర్కారు-2లో ఇదే చివరి బడ్జెట్ కావడం.. పాలమూరుపై అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టిసారించిన క్రమంలో.. జిల్లాకు పెద్దపీట దక్కుతుందని అన్నివర్గాల ప్రజలు ఆశిస్తున్నారు. గత ఎన్నికల వేళ, తదనంతర కాలంలో ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీల మేరకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు.

పూర్తికాని 'రుణమాఫీ'

గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ రూ.లక్ష వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే గత బడ్జెట్‌లలో కేటాయించిన అరకొర నిధులతో పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇప్పటి వరకు రూ.25 వేలలోపు వారికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 50 వేల మందికి రూ.47 కోట్లు మాఫీ అయినట్లు సమాచారం. ఇంకా 5.49 లక్షల మందికి రూ.2,735 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయిస్తారని రైతాంగం భారీ ఆశలు పెట్టుకుంది.

'దళితబంధు'కు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకానికి బడ్జెట్‌లో పెద్దపీట వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో వంద దళిత కుటుంబాలకు లబ్ధి చేకూరేలా ప్రక్రియ కొనసాగుతోంది. దీంతోపాటు నియోజకవర్గానికి మరో 400 నుంచి 500 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఇచ్చేలా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. మరోవైపు గిరిజనబంధు కూడా అమలు చేయనున్నట్లు పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు నిధులు కేటాయిస్తారని ఆయా వర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

బడుల మెరుగుకు..

మన ఊరు– మన బడి కింద ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య అమలు, మరమ్మతు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, ఫర్నీచర్, ప్రహరీలు, గోడలకు రంగులు, కిచెన్ షెడ్లు, నీటివసతితో కూడిన మరుగుదొడ్లు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్, అదనపు గదుల నిర్మాణం తదితర పనులకు గత బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో తొలి విడతలో 1,099 పాఠశాలలు ఎంపిక కాగా.. సుమారు 200 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి పూర్తి కావాలంటే రూ.300–400 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు.

పీయూకు అరకొరే..

పాలమూరు యూనివర్సిటీకి గత బడ్జెట్‌లో రూ.33.34 కోట్లు కేటాయించాలని ప్రతిపాదిస్తే రూ.9.85 కోట్లు కేటాయించారు. 2020– 21లో రూ.26 కోట్లకు రూ.7.36 కోట్లు, 2021–22లో రూ.28 కోట్లకు రూ.7.58 కోట్లు విదిల్చారు. ఏ సంవత్సరం కూడా ఆశించిన మేర నిధులు రాకపోవడంతో పీయూ ఆర్థిక ఇబ్బందులతో కునారిల్లుతోంది. అరకొరగా కేటాయించిన నిధులు అధ్యాపకులు, సిబ్బంది జీతభత్యాలకు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. కాగా, ఈసారి రూ.84 కోట్లు కావాలని పీయూ అధికారులు ప్రతిపాదించారు. కొత్త కోర్సుల నిర్వహణ, ఇతరత్రా అభివృద్ధి పనులకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేయాలని విద్యావేత్తలు, విద్యార్థులు కోరుతున్నారు.

ప్రాజెక్టులకు.. ఈసారైనా

ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలో 12.30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల అంచనా వ్యయం రూ.35,200 కోట్లు. 2015లో పనులు ప్రారంభం కాగా.. రూ.18,500 ఖర్చు చేసినట్లు అసెంబ్లీ వేదికగా గత బడ్జెట్ ప్రసంగంలో మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. అయితే గత బడ్జెట్ సమయంలో రూ.17 వేల కోట్లు ప్రతిపాదించగా.. తూతూమంత్రంగా రూ.1,400 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న అడ్డంకులను అధిగమించి పనులు పూర్తిచేస్తామని ఆర్థికమంత్రి చెప్పినా.. ఒక్క అడుగూ ముందుకుపడలేదు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పనుల కోసం రూ.2,800 కోట్లు ప్రతిపాదించారు. మరోవైపు కల్వకుర్తితోపాటు కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, జూరాల, ఆర్డీఎస్, కల్వకుర్తి, రాజీవ్ భీమా ఎత్తిపోతలకు సైతం గత బడ్జెట్‌లో అరకొరగా కేటాయించారు. చివరి దశలో ఉన్న ఈ ప్రాజెక్టుల అదనపు ఆయకట్టు పనులకు రూ.1,800 కోట్ల నుంచి రూ.2 వేల కోట్లు ప్రతిపాదించినట్లు సమాచారం. అలాగే నారాయణపేట జిల్లాలోని జయమ్మ, ఊట్కూరు జలాశయాల ఏర్పాటుకు రూ.25 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించారు.

నిధుల ట్రబుల్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రహసనంగా మారింది. మొత్తం 20,123 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా.. 8 వేల ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు కొనసాగుతున్నా.. చాలావరకు పునాది, పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. ఇందుకు నిధుల కొరతే కారణంగా తెలుస్తోంది. వీటి పూర్తికి రూ.500 కోట్ల నుంచి రూ.700 కోట్లు అవసరమని అంచనా. ఇదివరకు మంజూరు చేసిన డబుల్ ఇళ్లకు సంబంధించి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు ఉంటాయనే ఆశతో ఉన్నారు. అంతేకాకుండా సొంత స్థలం ఉంటే డబుల్ ఇళ్ల కోసం రూ.3 లక్షలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దీని కోసం ఈ బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు ఉంటాయని ఆశిస్తున్నారు.

మరో రెండు మెడికల్ కళాశాలలు..

వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఇది వరకే మెడికల్ కళాశాలలు మంజూరయ్యాయి. వీటికి గత బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం తరగతులు ప్రారంభమయ్యాయి. వీటితో పాటు నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో సైతం వచ్చే ఏడాది మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించగా.. ఈ మేరకు నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు.

55మంది ధ్రువపత్రాల పరిశీలన



గద్వాల అర్బన్: మూడు నెలల పాటు నిర్వహించే గ్రూప్స్ ఉచిత శిక్షణకు మొత్తం 146మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా.. వంద మందిని ఎంపిక చేశారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ -2,3,4 పరీక్షలకు సన్నద్ధమవుతున్న షెడ్యూల్ కులాలకు చెందిన నాన్ రెసిడెన్షియల్ అభ్యర్థులు స్పెషల్ ఫౌండేషన్ కోర్సు ఇవ్వనుంది. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశారు. ముందుగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను అధికారులు ఆ శాఖ కార్యాలయం వద్ద అతికించారు. అభ్యర్థులు ఉదయం కార్యాలయం వద్దకు చేరుకొని జాబితాలో తమ పేర్లను చూసుకొని వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు. ఆ శాఖ అధికారి శ్వేతా ప్రియదర్శినితోపాటు ఎస్‌డబ్ల్యూఓ, వార్డెన్లు... అభ్యర్థుల ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు కులం, ఆదాయం, ఆధార్ కార్డు వంటి ధ్రువపత్రాలను పరిశీలించారు. మొత్తం 55మందివి పరిశీలించారు.

నేటి నుంచి తరగతులు ప్రారంభం

ఎంపికైన అభ్యర్థులకు నేటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రంలో భీంనగర్‌లోని అక్షర కాన్సెప్ట్ స్కూల్ అభ్యర్థులకు తరగతులను కొనసాగించనున్నారు. ఉచిత స్టడీ మెటీరియల్స్‌తో పాటు, భోజన ఖర్చులు అందజేస్తారు. ఇలా మూడు నెలల పాటు అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి. ఆదివారం వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులు నేడు (సోమవారం) సైతం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరై తరగతులకు హాజరు కావచ్చని అధికారులు తెలిపారు.

ఆశాజనకంగా యాసంగి



మల్దకల్ మండలం సద్దనోనిపల్లి శివారులో వేరుశనగ పంట

- వరి, మొక్కజొన్న, పప్పుశనగ అధికంగా సాగు
- పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓలు
- ఇప్పటివరకు 1,07,082 ఎకరాల్లో వివిధ పంటల సాగు
- నీరు, వాతావరణ పరిస్థితుల అనుకూలంతో దిగుబడులు బాగా వచ్చే అవకాశం



మానవపాడు శివారులో సాగు చేసిన మొక్కజొన్న

గద్వాల వ్యవసాయం: జిల్లాలో యాసంగి సాగు ఆశాజనకంగా సాగుతోంది. వానాకాలం సీజన్ నిరాశ మిగిల్చినప్పటికి.. గంపెడు ఆశతో అన్నదాతలు యాసంగి సాగుబాటులో ఉన్నారు. ఈఓలు క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి సాగు చేసిన పంట వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1,07,082 ఎకరాల్లో వివిధ రకాల పంట వివరాలను నమోదు చేశారు.

నిరాశమిగిల్చిన వానాకాలం సీజన్

జిల్లాలో 2022 వానాకాలం సీజన్ ఆరంభంలో ఆశించిన స్థాయిలో సాగింది. మొదటి రెండు నెలలు మోస్తారుగా వర్షాలు కురిసాయి. దీనికితోడు ఎగువన కురిసిన వర్షాలతో జూరాల జలాశయానికి వరదనీరు చేరింది. దీనివల్ల వానాకాలం సీజన్ ఆశజనకంగానే సాగుతోంది అన్న సంతోషం ఆవిరి అయ్యింది. ఆ తర్వాత పంటకు పూత, కాయ పట్టే దశలో ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. పత్తి పంటకు పూత, కాయలు రాలాయి. దీంతో పాటు పత్తి, కంది, ఆముదం, వేరుశనగ, మిరప తదితర ప్రధాన పంటలకు రకరకాల తెగుళ్ళు విపరీతంగా ఆశించాయి. వీటి ఫలితంగా ఆయా పంటల దిగుబడులు గణనీయంగా తగ్గాయి.

ఆశించిన స్థాయిలో దిగుబడులు..

యాసంగి సీజన్ నడిగడ్డలో ఆశాజనకంగా సాగుతోంది. ఈఏడాది వానాకాలం జులై ఆఖరి వారంలో ఎగువన కురిసిన వర్షాలకు జూరాలకు వరదనీరు చేరింది. ఆ తర్వాత వర్షాలు సమృద్ధిగా కురవడం, జూరాల జలాయశం పూర్తి స్థాయి నీటి మట్టంతో జలకళ సంతరించుకుంది. దీంతో నెట్టెంపాడు ఎత్తిపోథల పథకం ద్వార గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు, తాటికుంట, ముచ్చోనిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లలతో పాటు, అనుబంధంగా ఉన్న చెరువులను నీటితో నింపారు. ఇలా రిజర్వాయర్లు, కాలువలు, చెరువుల కింద పంటలు వేశారు. వారబందీ పద్ధతిన సాగు నీటిని అందిస్తున్నారు. దీంతో పాటు బోర్లు, బావుల కింద వివిధ రకాల పంటలు వేశారు. వరి, వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న, జొన్న, మినుములు, జొన్న పంటలను ఎక్కువగా సాగు చేశారు. దాదాపు అన్ని పంటలు బాగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సాగునీరు అందుబాటులో ఉండటానికి తోడు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, దీనివల్ల అన్ని పంటల దిగుబడులు బాగా వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

సాగు వివరాలు ఆన్‌లైన్‌లో..

యాసంగిలో దాదాపు 1,38000 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని సీజన్‌కు ముందే అధికారులు అంచనా వేశారు. అయితే యాసంగి సీజన్‌లో రైతులు ఏఏ రకాల పంటలు వేశారో ఏఈఓలు క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడి వారు వేసిన పంట వివరాలను సేకరిస్తున్నారు. వివరాలను ఎప్పటికప్పుడు రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇలా పంట వివరాలను పకాగా నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1,07,082 ఎకరాల్లో వివిధ రకాల పంటల వివరాలను నమోదు చేశారు. ఈప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.

జిల్లాలో ఇప్పటివరకు పంట వివరాల నమోదు ఇలా..

పంట	సాగు (ఎకరాల్లో)
వరి	39,645
మొక్కజొన్న	26,594
పప్పుశనగ	13,821
వేరుశనగ	13,397
మినుములు	5,239
పొగాకు	2,920
ఆముదాలు	2,304
జొన్న	1,649
అలసంద	799
ఇతర పంటలు	341
కంది	165
పెసళ్ళు	144
చెరుకు	64

వివరాలు పక్కాగా నమోదు



జిల్లాలో ఈసారి యాసంగి సీజన్ ఆశాజనకంగా ఉంటుందని ముందుగానే అంచనా వేశాం. అవసరమైన ఎరువులు, విత్తనాలు కొరత రాకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. సీజన్ ఆశాజనకంగా సాగుతోంది. అన్ని పంటల దిగుబడులు బాగా వస్తాయి. ఏఈఓల ద్వార పంట వివరాలను పక్కగా నమోదు చేయిస్తున్నాం.

– గోవిందునాయక్, డీఏఓ

జములమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయ పరిసరాల్లో భక్తులు..

గద్వాల: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు.. భక్తులు కొంగు బంగారంగా భావించి పూజించే జములమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పౌర్ణమినాడు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు ఉదయం నుంచి దాసంగాలు పెట్టుకొని మేకలు, కోళ్లు బలిచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. నడిగడ్డ పరిసర ప్రాంతాలతోపాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి దాదాపు 20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాతవాటికి తోడు ఆలయం ఎడమ, ముందు భాగాలలో అదనంగా మూడు క్యూలైన్లు కొత్తగా ఏర్పాటు చేశారు. దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పోలీసులు బందోబస్తు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

జమ్ములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజైన పౌర్ణమినాడు తెల్లవారుజామున ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు సాంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. హైకోర్టు న్యాయమూర్తులు నంద, నాగార్జునలతో పాటు జిల్లా జడ్జీలు కనకదుర్గ, కవిత, ప్రభాకర్‌లు జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్డీఓ రాములుతో పట్టణ పుర ప్రముఖులు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సతీష్‌కుమార్ ఆలయ ఈఓ కవిత, డైరెక్టర్లు తదితరులున్నారు.

వారి త్యాగం మరువలేనిది..



నిర్వాసితులకు ప్లాట్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: రాజకీయ దురుద్దేశంతోనే గత దశాబ్దకాలంగా మండలంలోని నాగర్‌దొడ్డి ముంపు గ్రామ ప్రజలపై గత పాలకులు చిన్న చూపు చూస్తూ వచ్చారని, అదే భూ నిర్వాసితుల వల్లే గద్వాల సస్యశ్యామలం అయ్యిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో ప్లాట్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ గ్రామాల్లో కుట్రలు చేస్తున్నారన్నారు. తన గెలుపుకు కారణమైన మీకు నావంతుగా న్యాయం చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. గద్వాల నియోజకవర్గంలో ప్రాజెక్టులు, రిజర్వాయర్ల ద్వారా భూములు కోల్పోయిన వారి త్యాగాలు మరువలేనివన్నారు. అయితే గత పాలకులు నిర్వాసితుల పట్ల చిన్నచూపు చూడడం వల్లే గ్రామాన్ని తరలించడం ఆలస్యమైందన్నారు. షిఫ్టింగ్ చార్జెస్ కింద గట్టు మండలం ఆలూరుకి రూ.17 కోట్ల నష్ట పరిహారం చెల్లించడం జరిగిందన్నారు. రెండు, మూడు నెలల్లో నాగర్‌దొడ్డి గ్రామస్తులకు కూడా షిఫ్టింగ్ చార్జెస్ పరిహారాన్ని అందేలా చూస్తామన్నారు. కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టే నాయకులను నమ్మ వద్దన్నారు. వారు కేవలం ఓట్ల సమయాల్లో మాత్రమే గ్రామాల్లో మభ్యపెట్టే కార్యక్రమాలు చేస్తారన్నారు. అనంతరం గ్రామానికి చెందిన వారికి 289 ప్లాట్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపీపీ నజీమున్నీసా బేగం, జడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, డీఆర్ విజయ్ కుమార్, సర్పంచు ఉసేనమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మల్లంగారి లక్ష్మారెడ్డి (ఫైల్)

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ చెందిన మల్లంగారి లక్ష్మీరెడ్డి(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండాపూర్‌ల శివారులోని వాగు బ్రిడ్జి వద్ద మృతదేహం ఉన్నట్లు కోయిల్‌కొండ నుంచి కొండాపూర్ వస్తున్న ఒక వ్యక్తి పోలీసులకు సమాచారం అందించారు. ఒంటిపై గాయాలు ఉండటంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడా? లేదా ఇతర ఏవైనా కారణాలతో మృతిచెందాడా అనేది తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు..


చిన్నరాములు (ఫైల్)

మీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెలో ఆదివారం గొల్లచిన్న రాముడు (51) విద్యు దాఘాతానికి గురై మృతి చెందాడు. ఆదివారం ఉదయం తన ఇంటి వద్ద కొళాయికు నీళ్ల పట్టే క్రమంలో మోటా రు అమరుస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రమణమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది(బంగ్లగడ్డ)కి చెందిన వివాహిత అరుణ కనిపించడం లేదని తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన దేవరకొండ రాజనర్సింహ తన కుమార్తె అరుణను మిడ్జిల్ మండలం చిల్మేర్ చెందిన నాగరాజుతో 2022 డిసెంబర్ 4న వివాహం చేశాడు. జనవరి 14న అరుణ, నాగరాజు దంపతులు గొడవ పడగా భార్యను తన పుట్టింటి వద్ద వదిలి వెళ్లాడు. ఈనెల 4న నాగరాజు బంగ్లగడ్డలో ఉంటే తన మామకు ఫోన్ చేసి గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన అరుణ ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

అచ్చంపేట రూరల్: పురుగు మందు తాగి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని నడింపల్లి చెరువు సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని లింగోటం చెందిన లింగం(32) వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. ఆదివారం సాయంత్రం నడింపల్లి చెరువు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి గాలెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. భార్య రజితతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పులు ఉండటంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెక్కెంలో యువకుడు..

చిన్నంబావి: మండలంలోని బెక్కెం చెందిన రమేష్(24) అనే తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వృత్తి రీత్యా డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా వ్యక్తిగత కారణాలతో మానసిక ఇబ్బందులు పడుతుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తన వ్యక్తి గత కారణాలతోనే ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.


జాతరకు వస్తున్న భక్తులు..


జాతర మైదానం వ్యూ..


కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తూ..


చిన్నారుల భక్తి పారవశ్యం

మన్యంకొండ.. జనమే నిండా

- ఎటుచూసినా భక్తజన సందోహమే
- యాదగిరిగుట్ట నుంచి ప్రత్యేకంగా 13 బస్సుల రాక
- ఈ ఒక్కరోజే స్వామివారిని దర్శించుకున్న లక్షమంది
- గోవిందనామస్మరణతో మార్మోగిన ఆలయ గిరులు


ఆలయ ముఖ ద్వారం వద్ద భక్తుల రద్దీ

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తజన సందోహంతో పులకించిపోయింది. అశేష జనావళితో హోరెత్తిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే రెండో తిరుపతిగా పేరుగాంచిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి నిర్వహించనున్న ప్రధాన ఘట్టమైన రథోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు సుమారు లక్షకుపైగా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన జనంతో మన్యంకొండ గుట్టలు జనసంద్రంగా మారాయి. కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పేరుగాంచిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామిని రథోత్సవం సందర్భంగా దర్శించుకుంటే తాము చేసిన పాపాలన్ని తొలగిపోయి.. మోక్షం లభిస్తుందని, కోరిన కోరికలు తీరుతాయని నమ్మే భక్తజనులు పెద్దఎత్తున తరలివచ్చి ఎప్పుడెప్పుడు మహోన్నతమైన రథోత్సవ కార్యక్రమాన్ని కనులారా వీక్షించాలని ఉవ్విళూరారు. స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవాదాయ శాఖతోపాటు మన్యంకొండ పాలకవర్గాలు చేపట్టాయి. ముఖ్యంగా రవాణ సదుపాయాలను ఎంతో మెరుగుపరిచారు. అలాగే వసతి సౌకర్యాలను సైతం సమకూర్చారు. జాతర ప్రాంగణంలో ఎక్కడికక్కడ తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిర్మించిన వాటర్‌ట్యాంక్‌లకు ముందుగానే నీరు నిల్వ ఉంచుతున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మన్యంకొండ దేవస్థానంతోపాటు దేవస్థానం చుట్టూ గల కొండలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో కొండలన్నీ దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. భక్తుల గోవింద నామస్మరణతో మన్యంకొండ మార్మోగుతోంది.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు



మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ యాదాద్రి నుంచి ప్రత్యేకంగా 13 బస్సులను తెచ్చి కొండ కింది నుంచి పైవరకు నడుపుతోంది. బస్సులను సమయానుకూలంగా నడుపుతుండటంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొండపైకి చేరుకుంటున్నారు. అంతేకాకుండా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు డిపోల నుంచి మన్యంకొండ స్టేజీ వరకు జాతర ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.


దాసంగాలు తయారు చేస్తున్న మహిళలు


స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అత్యాశకు పోయి.. మోసపోయిన వ్యాపారి

విదేశీ నోట్లు ఎర వేసి రూ.5లక్షలు స్వాహా


బాదేపల్లిలో విచారిస్తున్న సీఐ రమేష్ బాబు

జడ్చర్ల: తన దగ్గర యూఏఈ దిరమ్స్ కరెన్సీ తీసుకుని తనకు కొంత నగదు అత్యవసరంగా ఉందని చెప్పి వ్యాపారిని మోసం చేసిన సంఘటన ఆదివారం బాదేపల్లిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్‌లో ఎస్‌బీఐ ఓల్డ్ హాస్పిటల్ దగ్గర పరీష యాస్మిన్ నిర్వహిస్తున్న ఆప్టికల్ దుకాణానికి ముస్తాఫా అనే వ్యక్తి కంటి అద్దాలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. ఆ సమయంలో దుకాణ నిర్వాహకురాలి భర్త ఖాజాసిరాజుద్దీన్‌తో పరిచయం చేసుకున్నాడు. అద్దాలు కొనుగోలు చేసి, తన దగ్గర ఉన్న యూఏఈ దిరమ్ ఉన్నాయని, ఇది తీసుకుని ఇండియా కరెన్సీ ఇవ్వమని కోరాడు. ఖాజాసిరాజుద్దీన్ అప్పటికే యూఏఈ వెళ్లి రావడంతో వాటిని గుర్తించి ఈ కరెన్సీ ఎక్కడిదని ప్రశ్నించాడు. దీనికి ముస్తఫా తాను ఒక వృద్ధురాలి ఇంటిలో పనిచేస్తానని, ఆమె కరోన సమయంలో మృతి చెందగా ఆమె కుమారులు యూఏఈలో ఉన్నందున కరోన కారణంగా రాలేక పోయారని తెలిపాడు. ఇంట్లో ఉన్న సామాను తననే తీసుకోవాలని ఆమె కుమారులు చెప్పడంతో వాటిని పరిశీలించగా అందులో యూఏఈ దిరమ్ ఉన్నాయన్నాడు. తదుపరి ఐదు రోజుల క్రితం 9004244933 నంబర్ నుంచి ముస్తఫా ఫోన్ చేసి తనకు డబ్బు కావాలని, తన దగ్గర ఉన్న యుఏఈ దిరమ్ ఇస్తానని చెప్పాడు.నాయన మాటలు నమ్మిన సదరు ఆప్టికల్ షాప్ నిర్వాహకులు రూ.5లక్షలు తీసుకుని ఆదివారం బాదేపల్లిలోని త్రిశూల్‌నగర్, సంజీవయ్య కాలనీల సమీపంలోని ఓ సందులోకి చేరుకున్నారు. అక్కడ ముస్తఫా ఒక మహిళతో కలిసి వచ్చి తమ దగ్గర ఉన్న రూ.5లక్షల నగదు తీసుకుని వారి దగ్గర ఉన్న యూఏఈ దీరమ్ ఉన్న కరెన్సీ సంచిని ఇచ్చారు. వెంటనే ఇంటికి వెళ్లి సంచిలో కరెన్సీని చూడగా పైన కింద మాత్రమే సౌదీ కరెన్సీ ఉండగా మధ్యలో తెల్లపేపర్లు ఉండడంతో ఆశ్చర్యపోయారు. తాము మోసపోయానని గ్రహించిన బాధితులు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ ఆధ్వర్యంలో హుటాహుటిన త్రిశూల్‌నగర్, సంజీవయ్యకాలనీలో గాలించినా ఫలితం లేకపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూ కబ్జాపై చర్యలకు ఆదేశం

నవాబుపేట: జైలు శిక్ష అనుభవిస్తున్న వ్యక్తి భూమిని ఫోర్జరీ సంతకంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటనపై పోలీసు యంత్రాంగం చర్యలకు ఆదేశించింది. ఆదివారం కిందిస్థాయి అధికారులను ఈ కేసుపై ఆరాతీసి వెంటనే చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. తీగలపల్లి చెందిన బాలస్వామి 2005లో జైలులో ఉండగా అతడి భూమిని కొందరు హైదరాబాద్ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించారు. ఏడాది పాటు జైలులో ఉండి 2006లో జైలు నుంచి వచ్చాడు. బాలస్వామి భూమిని రిజిస్ట్రేషన్ సమయంలో అతడి సంతకం ఫోర్జరీ చేశారని, తాజాగా పోలీసులను ఆశ్రయించాడు. భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తితో పాటు దానికి సహకరించిన వారిపై సైతం కేసులు నమోదు కాగా వారిని వెంటనే అరెస్టు చేసేలా చూడాలని ఎస్పీ ఆదేశించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

కుక్కల స్వైరవిహారం

బాలానగర్: మండలంలోని మోతిఘనపూర్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శనివారం ఇద్దరిని తీవ్రంగా దాడి చేసి గాయపరిచగా, ఆదివారం సైతం అదే గ్రామంలో మరో ఇద్దరిపై దాడి చేసి గాయపరిచాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణకు మళ్లీ ఆటంకాలు


సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్‌జాంతో నిలిచిన వాహనాలు

- పెరిగిన ధర చెల్లించాలని కాంట్రాక్టర్ అభ్యంతరం
- నేడు ఉన్నతాధికారులతో సమీక్ష
- కాంట్రాక్టర్ ఆమోదించకుంటే రీటెండర్

జడ్చర్ల టౌన్: రాయచూర్–కోదాడ 167వ నంబర్ జాతీయరహదారిపై మున్సిపాలిటీ పరిధిలో సిగ్నల్ గడ్డపై రోడ్డు విస్తరణ పనులకు మళ్లీ ఆటంకాలు ఏర్పడ్డాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టరు తమకు గిట్టుబాటు కావటం లేదని, పెరిగిన ధరల ప్రకారం చెల్లించాలంటూ పనులు చేపట్టేందుకు అభ్యంతరం తెలిపారు.

రూ.44.50కోట్లతో టెండర్

167వ నంబర్ జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా సిగ్నల్‌గడ్డపై రైల్వేలైన్ ఉండటంతో క్రాస్ రోడ్డువైపు ఎల్ఐసీ కార్యాలయం, డిగ్రీ కళాశాల వైపు మహిళా హాస్టల్ వరకు మొత్తం 750 మీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టలేదు. మొదట ఇక్కడ ఫ్లెఓవర్ చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ రూ.48కోట్లతో టెండరు పిలిచి ఆవేక్ష కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించింది. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టరు మార్కింగ్ వేస్తుండటంతో ఫ్లెఓవర్ వద్దంటూ స్థానికులు అభ్యంతరాలు తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జోక్యం చేసుకుని జాతీయ రహదారుల శాఖ అధికారులతో చర్చించి ఫ్లెఓవర్ రద్దుచేయించి 100అడుగల రోడ్డునే ఖరారు చేయించారు. గతేడాది ఆగస్టులో ఖరారైనప్పటికి మారిన ప్రతిపాదనలను ఆమోదించేందుకు ఆలస్యమైంది. ఎట్టకేలకు డిసెంబర్ నెలలో రూ.44కోట్ల50లక్షలతో ముందుగా టెండరు పొందిన కాంట్రాక్టరుకు పనులు అప్పగించింది. ఈ మేరకు జనవరి మొదటి వారంలో రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, డబ్బాలను తొలగించారు. విద్యుత్ లైన్లు వేసేందుకు స్తంభాలు ఏర్పాటు చేశారు. చెట్లను సైతం తొలగించారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ రావటంతో పనులు నిలిపివేశారు. ఆ తర్వాత మళ్లీ చేపడతామని చెప్పినప్పటికి పనులు చేపట్టకుండా ఉన్నారు.

పెరిగిన ధరల ప్రకారం చెల్లించాలని..

2022 జనవరిలో టెండరు పొందిన ఆవేక్ష కన్‌స్ట్రక్షన్స్ 2022 డిసెంబర్ నెలలో రీ టెండరు దక్కించుకున్నారు. అయితే మొదటి టెండర్ ధరల ప్రకారం పనులు చేపట్టాల్సి రావటంతో ఏడాది కాలం జాప్యం అయినందున పెరిగిన ధరల ప్రకారం డబ్బులు చెల్లించాలని కాంట్రాక్టరు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని జాతీయ రహదారుల శాఖ అధికారులు తమ ఉన్నతాధికారులకు విన్నవించారు. కాంట్రాక్టరు విజ్ఞప్తిపై సోమవారం హైదరాబాద్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్షలో కాంట్రాక్టరు విముఖత వ్యక్తం చేసినట్లయితే టెండరు రద్దు చేసే అవకాశాలున్నాయి. అంతేకాక కాంట్రాక్టర్ సుముఖంగా లేరని తెలుస్తుంది. దీంతో రోడ్డు విస్తరణ పనులకు మరోసారి ఆటంకం కలిగి మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి. డబ్బాలు వేసుకుని జీవనం సాగిస్తున్న తమ బతుకులు రోడ్డున పడేశారని చిరువ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ట్రాఫిక్ సమస్య సైతం ఇబ్బంది పెడుతూనే ఉంది. శనివారం సాయంత్రం గంటపాటు ట్రాఫిక్ జాం కావటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకుని పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ అభ్యంతరం వల్లే..

పెరిగిన ధరల ప్రకారం డబ్బులు చెల్లించాలని కాంట్రాక్టర్ అభ్యంతరం చెప్పటం వల్లే పనులు నిలిచిపోయాయి. ఫ్లెఓవర్ రద్దయిన స్థానంలో నాలుగులైన్ల రోడ్డు మంజూరు కావటంతో ఏడాది ఆలస్యమైంది. దీంతో ధరలు పెంచాలని కాంట్రాక్టరు కోరడంతో ఉన్నతాధికారులకు నివేదించాం. సోమవారం హైదరాబాద్‌లో సమీక్ష ఉంది. ఈ సమీక్షలో విస్తరణ పనుల భవితవ్యం తేలనుంది. కాంట్రాక్టరు ఆమోదించకుంటే రీ టెండరుకు ఆస్కారం ఉంది.

– అశోక్‌రెడ్డి, డీఈ, 167 జాతీయరహదారి

అంతర్రాష్ట్ర బ్రిడ్జిపై నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్


కృష్ణా బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు



కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణానదిపై ఉన్న అంతర్రాష్ట్ర బ్రిడ్జీపై ఆదివారం నాలుగు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు 10కిలోమీటర్ల వరకు వాహనాలు రోడ్డుపై నిలిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంతకాలంగా ఈ బ్రిడ్జిపై గుంతలు విపరీతంగా పెరిగాయి. బూడిద లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండడం మూలంగా గుంతల్లో ఆ వాహనాలు ఇరుక్కుంటున్నాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అటు కర్ణాటక, ఇటు తెలంగాణకు చెందిన పోలీసులు ట్రాఫిక్‌జామ్ అయిన సమయంలో వెంటనే స్పందిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ ఒక్కోమారు పోలీసులకు సమాచారం వచ్చే సమయానికే వాహనాలు కిలోమీటర్ల పొడవునా నిలిచిపోతున్నాయి. ఈ దారిలో హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు వెళ్లే ప్రయాణికుల వాహనాలతో పాటు వాణిజ్య వాహనాలు కూడా అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు

పాడిపంట

అధికారి సలహా: బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి


కోయిలకొండ మండలం తిరుమలంపల్లిలో వరి పైరును పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేష్

మహబూబ్‌నగర్(వ్యవసాయం): ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు పండిస్తున్న యాసంగి వరిలో సమస్యలు తలెత్తుతున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ తెలియజేశారు. ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు.

మొగిపురుగు నివారణకు..

జిల్లాలో వరిలో ఆశించిన మొగిపురుగు నివారణకు ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా కారటాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జి 4 కిలోల గుళికలను చల్లాలి. ఉల్లకోడు నివారణకు ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను బురద పదునులో చల్లాలి. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథియోలిన్ 1.5 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింకు లోప నివారణకు 2 శాతం జింకు సల్ఫేటు ద్రావణాన్ని 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో రెండు సార్లు నాటిన వరిలో అధిక నీటి నిల్వతో సల్ఫైడ్ ఇంజూరీ సమస్య తలెత్తి మొక్కలు ఎదగక రంగుమారి గిడసబారి పోతున్నాయి. సల్ఫైడ్ ఇంజూరీ నివారణకు పొలంలోని నీటిని పూర్తిగా తీసివేసి నేల సన్నని పగుళ్ల వచ్చేవరకు ఆరబెట్టాలి.

సమస్య: పిలకదశ నుంచి దుబ్బు చేసే దశలో ఉన్న వరి పై ర్లలో నాచు ఉంచటంతో ఎదుగుదల పూర్తిగా ఆగిపోతుంది.

నివారణ: వరి పొలంలో నాచు కట్టడంతో ఎదుగుదల లేకపోవడంతో రైతులు పైపాటుగా యూరియా మరియు సిఫారసు చేయబడని సేంద్రియ గుళికలను వేయడం గమనించాం. ఈ సమస్య నుండి అధిగమించడానికి వరి పొలాన్ని చేతులతో కలియబెట్టాలి. అలాగే పొలాన్ని అడపాదడపా ఆరగట్టాలి.

సమస్య: పొలంలో చవుడు మరియు జింక్ లోపం వంటి సమస్యలను నివారించడానికి సిఫారసు చేయబడని సేంద్రియ గుళికలు/ హ్యూమిక్ ఆసిడ్/ సీ–వీడ్ ఎక్స్ట్రాక్ట్‌ను వేయడం మరియు పొలాన్ని పూర్తిగా నెర్రలు ఏర్పడే వరకు ఎండగట్టడం.

నివారణ: పొలంలో నీరు పెట్టి తర్వాత బయటకు తీసివేయాలి. వరి పైరు ఎదుగుదలకు మరియు భూమిలోని శిలీంద్రాలను నివారించడానికి కలుపు తీసిన తర్వాత ఎకరానికి 25 నుంచి 30 కిలోల యూరియా మరియు కార్బెండిజమ్ 25 శాతం + మ్యాంకోజెబ్ 50 శాతం పొడి మందును కలిపి బురద పదునులో చల్లాలి. జింక్ లోపం గమనించినట్లైయితే జింక్ సల్ఫేట్ (21–33 శాతం) 2 గ్రాములు, లీటరు నీటికి కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

సమస్య: ఈ యాసంగిలో కొన్ని ప్రాంతాల్లో మొగిపురుగు ఉధృతి అధికంగా ఉంది. దీనిని నివారించడానికి రైతులు క్లోరిఫైరిఫాస్ 10జి గుళికలు / సేంద్రియ గుళికలు యూరియాలో కలిపి వేయడంతో పాటుగా సైపర్‌మెత్రిన్ లేదా క్లోరిపైరిఫాస్ పురుగు మందులను పిచికారీ చేయడంతో పురుగు నివారణ జరగలేదు.

నివారణ: వరిలో కాండం తొలిచే పురుగు రెండు దశల్లో ఆశిస్తుంది. ప్రస్తుతం ఈ పురుగు ఉధృతి పిలక దశలో(మొవ్వ చనిపోవడం) ఆశించి అధికంగా నష్ట పరుస్తుంది. ఈ పురుగు నివారణకు సమగ్ర రక్షణ చర్యలను చేపట్టాలి.

వరి పంట నాటిన 15 నుంచి 40 రోజుల దశలో ఉన్న పైర్లలో కార్బోఫ్యూరాన్ 3జి 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి కిలోలు లేదా క్లోరాంత్రానిలిప్రోల్ 0.4జి 4 కిలోలు ఎకరానికి చొప్పున 25 కిలోల పొడి ఇసుకతో కలిపి బురద పదునులో వేయాలి.

- వరి పంట అంకురం ఏర్పడే దశ నుంచి చిరుపొట్ట దశలో రెక్కల పురుగులు గమనించినట్లైతే ఎకరానికి 60 మిల్లీలీటర్ల క్లోరాంత్రానిలిప్రోల్ లేదా 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 100 మిల్లీలీటర్ల టెట్రానిలిప్రోల్ పిచికారీ చేయాలి.
- ఫిబ్రవరి, మార్చి మాసాల్లో వరి పంటలో అగ్గి తెగులు(మెడవిరుపు) కూడా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ముందుగా నాట్లు వేసిన జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ సమస్యను గుర్తించాం. వరి పైరు వివిధ సమస్యలతో ఎదగటం లేదని యూరియాను పైపాటుగా మోతాదుకు మించి వేసిన ప్రాంతాల్లో ఈ తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి. అగ్గితెగులు లక్షణాలు గమనించినట్లైతే యూరియాను తాత్కాలికంగా ని లిపివేయాలి. లక్షణాలను తొలిదశలో గుర్తించి సిఫారసు చేయబడిన తెగుళ్ల మందులను పిచికారీ చేయాలి.

బడ్జెట్ రూ.2.9 లక్షల కోట్లు.!

- 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ కసరత్తు పూర్తి
- నేటి ఉదయం 10:30 గంటలకు శాసనసభ ముందుకు..



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) గాను రూ.2.9 లక్షల కోట్ల వరకు అంచనాలతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టే అవకాశాలున్నాయని తెలుస్తోంది. 2022–23కు రూ.2.56 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్ ప్రవేశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈసారి ఆ మొత్తానికి 10 శాతం కంటే కొంచెం ఎక్కువగా రూ. 2.9 లక్షల కోట్ల వరకు బడ్జెట్ అంచనాలను ప్రతిపాదించనుందని సమాచారం. ఎన్నికల ఏడాది కావడంతో సంక్షేమం, అభివృద్ధిని యథాతథంగా కొనసాగిస్తూ కొన్ని కొత్త పథకాలను జోడిస్తూ ప్రజారంజక బడ్జెట్ పెట్టే కసరత్తు పూర్తయిందని, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఈసారి బడ్జెట్ పెట్టే అవకాశాలున్నాయని ఆర్థికశాఖ వర్గాల ద్వారా తెలిసింది. సోమవారం ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు శాసనసభలో 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆ తర్వాత శాసన మండలిలో రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రవేశపెడతారు.

సాగునీటికి, సంక్షేమానికి భారీగానే..

గత కొన్నేళ్లుగా బీఆర్‌ఎస్ మార్కుతో అమలవుతోన్న సంక్షేమ పథకాలన్నీ ఎన్నికల ఏడాదిలో యథాతథంగా కొనసాగేలా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధమైనట్టు సమాచారం. ఈ పథకాలకు తోడు విద్య, వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన, మన ఊరు–మన బడి లాంటి పథకాలకు ప్రత్యేక కేటాయింపులు ఈ బడ్జెట్‌లో ఉండనున్నాయని ఆర్థికశాఖ వర్గాలంటున్నాయి. వీటితో పాటు సాగునీటి రంగానికి కూడా ఈసారి భారీ బడ్జెట్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం తెచ్చిన అప్పులు ఈ ఏడాది నుంచే తిరిగి చెల్లించాల్సి ఉండడంతో దాని కోసం, పాలమూరు–రంగారెడ్డి లాంటి ప్రాజెక్టులు వేగవంతం చేసేందుకు, ఆగిపోయిన పలు ప్రాజెక్టులను పూర్తి చేసి ఎన్నికల నాటికి ప్రజలకు అందించేలా.. రూ.35 వేల కోట్లకు పైగా సాగునీటి రంగానికి ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుబంధు లాంటి ప్రతిష్టాత్మక పథకం కొనసాగింపుతో పాటు కొత్తగా పంటల బీమా పథకం అమలు చేసేందుకు గాను ఈసారి వ్యవసాయానికి రూ.25 వేల కోట్ల వరకు కేటాయింపులుంటాయని తెలుస్తోంది. పంటల బీమా పథకం కోసం రూ.1,200 కోట్లు, రైతుబంధు పథకం కింద రూ. 8 వేల కోట్ల వరకు ప్రతిపాదించనున్నట్టు సమాచారం. ఇక దళిత బంధుకు గత ఏడాది పెట్టిన బడ్జెట్‌లో ఖర్చు కాకుండా మిగిలిన మొత్తాన్ని ఈ ఏడాదికి బదలాయిస్తూ రూ.20 వేల కోట్ల వరకు కేటాయింపుల్ని ఈ పథకానికి చూపెట్టనున్నట్టు తెలుస్తోంది. దళిత బంధు తరహాలోనే గిరిజన బంధును రూ. 5 వేల కోట్లు (అంచనా) కూడా ప్రకటించే అవకాశముందని, అయితే గిరిజన బంధుకు మార్గదర్శకాలు కూడా సిద్ధం కాని నేపథ్యంలో ఎన్నికల నాటికి బడ్జెట్‌ను ఖర్చు పెట్టగలిగేందుకు ఉన్న అవకాశాలను బట్టి ఈ పథకాన్ని బడ్జెట్‌లో పొందుపరిచే అవకాశాలున్నాయని గిరిజన సంక్షేమ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

సొంత రాబడులపైనే ఆశలు..

రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయంపైనే ఆధారపడి బడ్జెట్ కేటాయింపులు ప్రతిపాదించనున్నట్టు ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.08 లక్షల కోట్ల వరకు పన్ను రాబడులు అంచనా వేయగా, అంచనాలకు తగ్గట్టునే ఈ ఏడాది పన్ను ఆదాయం రూ.లక్ష కోట్లు దాటనుంది. ఈ నేపథ్యంలో సొంత పన్నులు.. ముఖ్యంగా ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల ఆదాయాలను పరిగణనలోకి తీసుకుని గత బడ్జెట్ కంటే 10%నికి పైగా ఎక్కువ అంచనాలను రూపొందించినట్టు సమాచారం. అప్పుల విషయానికొస్తే ఎఫ్‌ఆర్‌బీఎం చట్ట నిబంధనల మేరకు జీఎస్‌డీపీలో 3.5% వరకు ప్రతిపాదించనున్నారు.

ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం

ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య పథకం అమలు కోసం ఉద్యోగుల భాగస్వామ్యంతో కొత్త పథకాన్ని అమలు చేసే యోచనలో భాగంగా రూ.750 కోట్ల కార్పస్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో తన వాటాగా రూ.350 కోట్లు ప్రతిపాదించనున్నట్లు సమాచారం. గత బడ్జెట్ తరహాలోనే సొంత జాగా ఉంటే ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షల పథకం కింద రూ.12 వేల కోట్లు, ప్రతి గ్రామపంచాయతీకి రూ.10 లక్షల అభివృద్ధి నిధుల కోసం రాష్ట్రంలోని 12 వేల గ్రామ పంచాయతీలకు రూ.1200 కోట్లు కేటాయించనున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలను కొనసాగించనున్నారు. ఆసరా పింఛన్లకు రూ.15 వేల కోట్ల వరకు ప్రతిపాదించనున్నారు. ఇక ఎన్నికల హామీలో నెరవేర్చడంలో భాగంగా రూ.లక్ష లోపు రైతు రుణమాఫీకి ఈసారి నిధులు కేటాయిస్తారని, ఈ పద్దు కింద రూ.20 వేల కోట్లు అవసరమవుతాయనే చర్చ జరుగుతోంది. విద్యుత్ సబ్సిడీలు, ఆర్టీసీకి ఆసరా కోసం కూడా ప్రత్యేక కేటాయింపులు చూపెట్టనున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల పద్దుకు రూ.30 వేల కోట్లు, అప్పులు, వడ్డీల చెల్లింపునకు రూ.25 వేల కోట్ల వరకు కేటాయించనున్నట్టు సమాచారం.

కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంచనాలపై ఆసక్తి

కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు కింద భారీగా అంచనాలు ప్రతిపాదించడం, కేంద్రం నుంచి ఆశించిన మేర నిధులు రాక డీలా పడిపోవడం ఆనవాయితీగా మారిపోయింది. గత ఏడాది రూ.38 వేల కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వస్తాయని ఆశించినా రూ.10 వేల కోట్లు కూడా రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఈ అంచనాలు రూ.40 వేల కోట్లు దాటినా, ఈసారి కూడా గత ఏడాదిలాగానే మంజూరయ్యాయి. దీంతో ఈసారి గ్రాంట్ ఇన్ ఎయిడ్, కేంద్ర పన్నుల్లో వాటా పద్దుల కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంత అంచనా వేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈసారి కేసీఆర్ మార్కు బడ్జెట్ అంకెలు ఉంటాయని, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.3 లక్షలు దాటిన నేపథ్యంలో బడ్జెట్ అంచనాలు కూడా రూ.3 లక్షల కోట్లు ఉంటాయనే ప్రచారం జరిగినా, వాస్తవికతకు అనుగుణంగానే ప్రభుత్వం ముందుకెళ్లనుందని సమాచారం. ఇక 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.2.56 లక్షల కోట్ల బడ్జెట్ అంచనా వేసినా.. అప్పులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ పథకాల్లో కేంద్రం నిధుల కోత పెట్టిన కారణంగా సవరించిన అంచనాలు రూ.2.25 లక్షల కోట్లకు పరిమితమయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కుట్రపూరిత కథనాలే

- ఓఎస్డీతో కలసి నేను విజయవాడ వెళ్లినట్లు అభూత కల్పనలు: సీఎస్ జవహర్‌రెడ్డి
- పొరపాటును అంగీకరిస్తూ బేషరతుగా క్షమాపణలు కోరాల్సిందే
- లేదంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవు



సాక్షి, అమరావతి: 'సీఎస్‌తో కలసి వెళ్లిన ఓఎస్డీ' శీర్షికన ఎల్లో మీడియా ప్రచురించిన కథనాలను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దారుణమైన అబద్ధాలను ఆలంబనగా చేసుకుని ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు, ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ చానల్ రాష్ట్రంలో ఉద్యోగులందరికీ అధినేత అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చులకన చేస్తూ, కుట్రపూరితంగా కట్టుకథలు అల్లాయని స్పష్టం చేశారు. ఓ అత్యున్నత స్థాయి అధికారిని, వ్యవస్థను కించపరుస్తూ తప్పుడు కథనాలు ప్రచురించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఉద్యోగులందరిలో అత్యున్నస్థాయి అధికారిని టార్గెట్ చేస్తూ అవాస్తవాలను ప్రచురించడం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిష్టకు భంగం కలిగించడం ద్వారా ఏ జర్నలిజం విలువల ఆధారంగా పని చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. తాను ఖండనలో పొందుపరిచిన అన్ని విషయాలను అంతే ప్రాధాన్యతతో, బేషరతుగా క్షమాపణలు కోరుతూ ప్రచురించాలన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన సత్యదూరమైన న్యూస్ ఐటమ్‌ను ఆయా పత్రికల్లో ఏ పేజీల్లో ఎంత ప్రాముఖ్యతతో ప్రచురించారో, ఏ సమయంలో ఎంత ప్రాధాన్యతతో చానల్‌లో కథనాలను ప్రసారం చేశారో అంతే ప్రాముఖ్యత, ప్రాధాన్యతతో ఖండనను ప్రసారం చేస్తూ జరిగిన పొరపాటుకు క్షమాపణలు కూడా కోరాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో ఆ న్యూస్ ఐటమ్‌కు బాధ్యులపై న్యాయ నిపుణుల సలహా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీట్ నంబర్ 1 డి... వెళ్లింది హైదరాబాద్

వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం అహోబిలపురం సమీపంలో రూ.5 కోట్లతో పునర్నిర్మించిన శ్రీ భానుకోట సోమేశ్వరాలయం మహా కుంభాభిషేకాన్ని ఫిబ్రవరి 4వతేదీ ఉదయం 9.58 గంటలకు నిర్వహించాలని ముహూర్తాన్ని నాలుగు నెలల క్రితమే 2022 అక్టోబర్ 14 నిర్ణయించారని సీఎస్ తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో తాను ఫిబ్రవరి 2వతేదీ రాత్రి 11 గంటలకు రేణిగుంట ద్వారా కడప చేరుకున్నట్లు వివరించారు. 3వ తేదీ ఉదయం 9.50 గంటలకు కడప కలెక్టర్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఆలయ కార్యక్రమాల్లో పాల్గొన్నారని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తాను చదువుకున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ముద్దనూరులో విద్యార్థులతో సమావేశం ముగియగానే 4.40కి బయలుదేరానని, సుమారు 8.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్, ఇతర అధికారులు తనకు మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికారని తెలిపారు. రాత్రి 9 గంటలకు స్పైస్‌జెట్ ఎస్‌జీ 3003 సిరీస్ ద్వారా 1 డి సీట్‌లో ప్రయాణించి హైదరాబాద్ చేరుకున్నట్లు జవహర్‌రెడ్డి వివరించారు. వాస్తవాలు ఇలా ఉంటే శుక్రవారం రోజు సీఎస్‌తో కలసి ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి విజయవాడ వెళ్లారని, ఒకే వాహనంలో ప్రయాణించారని ప్రచురించిన కథనాలు ఊహాజనితం, సత్యదూరమని చెప్పారు. దారుణమైన ఈ అబద్ధాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

హరీశ్‌రావు చేతుల మీదుగా నాలుగోసారి బడ్జెట్



సాక్షి, సిద్దిపేట: ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో నాలుగోసారి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2004 సంవత్సరం నుంచి ఆయన సిద్దిపేట ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత నేత వైఎస్సార్ కేబినెట్‌లో యువజన వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన తెలంగాణ వచ్చాక భారీనీటిపారుదల శాఖను నిర్వహించారు. 2019లో ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు హరీశ్‌రావు మార్చి8, 2020, మార్చి 18, 2021, మార్చి 7, 2022న మూడుసార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2023–2024 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు.

ముగిసిన వాణీ జయరామ్ అంత్యక్రియలు

- నివాళులర్పించిన సినీ, రాజకీయ ప్రముఖులు
- వాణీజయరామ్‌ది సహజ మరణమేనని పోలీసుల ధ్రువీకరణ

తమిళ సినిమా: ప్రముఖ గాయని వాణీజయరామ్ భౌతికాయానికి ఆదివారం మధ్యాహ్నం చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు వాణీజయరామ్ పార్థివ దేహానికి తమిళనాడు సీఎం స్టాలిన్, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అంజలి ఘటించారు. ప్రఖ్యాత గాయని పి.సుశీల వాణీజయరామ్ మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. అందులో తనకు ఈ విషయం ఆలస్యంగా తెలిసిందని హైదరాబాద్‌లో ఉన్న తన మనవరాలు ఫోన్ చేసి వాణీజయరామ్ కన్నుమూసిన విషయం తెలుసా అని అడిగిందన్నారు. దాంతో తాను షాక్‌కు గురైనట్లు పేర్కొన్నారు. వాణీజయరామ్‌తో కలిసి తాను 100 పాటలు పాడినట్లు గుర్తు చేసుకున్నారు. ఆమె పెద్దగా నవ్వే వారు కాదని, తాను జానకి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కలిసి ఉన్నప్పుడు మాత్రమే వాణీజయరామ్ నవ్వేవారని చెప్పారు. ఏడు స్వరాల పాటను ఆమె మినహా ఎవరు పాడలేరని, వాణీజయరామ్‌ది ప్రత్యేక స్వరం అని పి.సుశీల కొనియాడారు. కాగా వాణీజయరామ్‌ది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ఆమెది సహజ మరణమేనని పోలీసులు ధ్రువీకరించారు. వాణీజయరామ్ తలకు బలమైన గాయం కావడం, ముఖం రక్తసిక్తమై ఉండటం, చేతి రేఖలు వంటి ఆధారాలను తుడిచి వేయడంతో మొదట అనుమానాస్పద మృతిగా భావించారు. వాణీజయరామ్ తన గదిలోని అద్దంతో కూడిన టీపాయ్‌పై పడటంతో తలకు బలమైన దెబ్బ తగలడం వల్ల మృతి చెందినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందన్నారు. పోలీసులు తుపాకులతో 30 రౌండ్లు గాలిలో ఫైర్ చేసిన అనంతరం వాణీజయరామ్ భౌతికకాయానికి చెన్నై బీసెంట్ నగర్‌లోని శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు.


నివాళులర్పిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

ఇంటర్నేషనల్‌కు పీఈటీ ఎంపిక


రవనీల

కోడేరు: ఆల్ ఇండియా నేషనల్ గేమ్స్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో నాలుగు స్వర్ణాలు సాధించి ఇంటర్నేషనల్‌కు యువతి ఎంపికైంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం మాదారం చెందిన రవనీల కోడేరు గురుకుల పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తుంది. ఈనెల 2 నుంచి ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఆల్ ఇండియా నేషనల్ గేమ్స్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో రవనీల 100, 200 మీటర్లు, పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించింది. 5కే నడక, 110 హ్యాండిల్స్ పోటీలో స్వర్ణం సాధించింది. త్రోలో కాంస్యం సాధించింది. నాలుగు స్వర్ణ పతకాలు సాధించిన రవనీలను ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపిక చేశారు.

అనిరుధ్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



రాజాపూర్: కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డి ఇంటికి మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి ఆదివారం రావడం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని రంగారెడ్డిగూడలో నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ ఉత్సవాల్లో పాల్గొనేందుకు పీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి ఆహ్వానం మేరకు వచ్చారు. కాగా ఆమెతో పాటు భర్త మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి కొంత కాలంగా టీడీపీని వదిలి తటస్థంగా ఉన్నారు. తాజాగా అనిరుధ్‌రెడ్డితో మంతనాలు చేయడం రాజకీయంగా చర్చనియాంశంగా మారింది.

కారు బోల్తా: ముగ్గురికి గాయాలు

అలంపూర్: నిద్రమత్తు కారణంగా కారు అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన అలంపూర్‌చౌరస్తాలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, వంశీ, అనిల్‌కుమార్‌రెడ్డి కారులో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కర్నూల్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే నిద్రమత్తులో కారు అదుపుతప్పింది. దీంతో సమీపంలోని వాగులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

'డబుల్' ఇళ్లకు ఎదురుచూపులు


కావేరమ్మపేటలో పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లు

- నత్తనడకన సాగుతున్న నిర్మాణాలు
- పూర్తయిన ఇళ్లకు లభించని మోక్షం
- నియోజకవర్గంలో 2,604 ఇళ్లు మంజూరు

మండలం	మంజూరైనవి	పూర్తయినవి
జడ్చర్ల	2,132	739
బాలానగర్	104	64
మిడ్జిల్	72	24
నవాబుపేట	192	80
రాజాపూర్	104	40
మొత్తం	2,604	947

జడ్చర్ల: ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు నియోజకవర్గంలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదు. అసలు డబుల్ బెడ్రూం ఇళ్లకు ఇప్పటి వరకు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో కూడా స్పష్టత లేదు. దీంతో లబ్ధిదారుల ఎంపికలో అయోమయం చోటు చేసుకుంది.

2,604 ఇళ్లు మంజూరు

నియోజకవర్గంలో దశల వారీగా 2,604 ఇళ్లు మంజూరయ్యాయి. ఎక్కువగా మండలంలోనే 2వేల ఇళ్లు నిర్మిస్తున్నారు. బాలానగర్, రాజాపూర్ మండలాల్లో కేవలం 104 చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి.

స్థలం లేక ఇబ్బందులు

ఇళ్ల నిర్మాణానికి చాలా చోట్ల సరైన స్థలాలు దొరకక ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడం, భూముల ధరలు పెరిగిపోవడంతో అవరోధం కలుగుతుంది. దీంతో చాలా చోట్ల జీ ప్లస్ టు పద్ధతిన నిర్మిస్తున్నారు.

నాసిరకంగా పనులు

పనులు నాసిరకంగా సాగుతున్నాయన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర ఎంత మాత్రం గిట్టుబాటు కాకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. ఇసుక, స్టీలు, సిమెంట్ తదితర మెటీరియల్ ధరలు పెరగడంతో నిర్మాణం భారంగా మారింది.


ఎర్రగుట్టలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు

దరఖాస్తుల వెల్లువ

ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జడ్చర్ల పట్టణంలోనే దాదాపు 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే అర్హులను గుర్తించి కేటాయించడంలో అధికారులు ఎంత మేరకు పారదర్శకతను పాటిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం



కావేరమ్మపేటలో ఇళ్లు పూర్తయ్యాయి. మౌలిక సౌకర్యాలను కూడా వెంటనే పూర్తి చేసి అర్హులైన తమ లాంటి వారికి ఇళ్లను కేటాయించాలి. ఇల్లు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– స్వాతి, కావేరమ్మపేట

అర్హులను ఎంపిక చేస్తాం..



డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు పట్టణానికి సంబంధించి దాదాపు 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని విచారించి అర్హులైన వారిని త్వరలోనే గుర్తించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

పనులు పూర్తి చేసేందుకు చర్యలు



ఇళ్ల పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. పనులు వివిధ దశలలో కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో ఇళ్లు పూర్తయినా మరికొన్ని గ్రామాలలో పురోగతిలో ఉన్నాయి. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాము.

– నాగేందర్‌గౌడ్, హౌసింగ్ ఏఈ, జడ్చర్ల

పనులు పూర్తయ్యి నాలుగేళ్లు

బాదేపల్లి ఎర్రగుట్ట ప్రాంతంలో 200 ఇళ్లను పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నాయి. ఇక్కడ పనులు పూర్తయి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించలేదు. కావేరమ్మపేటలో కూడా ఇళ్ల పనులు పూర్తయ్యాయి. ఇక్కడ తాగు నీరు, విద్యుత్, సీసీరోడ్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చర్లపల్లి, కిష్టంపల్లిలో పనులు పూర్తయ్యాయి. బాలానగర్ మండలంలోని గౌతాపూర్, నవాబుపేట మండలంలోని రుద్రారం, మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి, మసిగుండ్లపల్లి, వాడ్యాల గ్రామాలలో ఇళ్ల పనులు పూర్తి అయ్యాయి.

1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగుల వరకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 205 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 50, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

అమ్మవారిని దర్శించిన హైకోర్టు జడ్జి


హైకోర్టు జడ్జి సూరేపల్లి నందాకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పురందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు అర్చకులతో కలిసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేయించారు. వారితో పాటు జిల్లా జడ్జి కనకదుర్గ, అదనపు జిల్లా జడ్జి అనిరుజ్ క్రిస్టేన్, సీనియర్ సివిల్ జడ్జి గంట కవిత, జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవిత, గాయత్రి, ఆర్డీఓ రాములు, డీఎస్పీ రంగస్వామి, తహసీల్దార్ నాయుడు ఉన్నారు.

ఆలయంలో చండీహోమాలు

జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక చండీ హోమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన హోమాలు మధ్యాహ్నం 12:30కు ముగిశాయి. పాల్గొన్న భక్తులకు దేవస్థానంలోని నిత్యాన్నదాన సత్రంలో భోజన సదుపాయం కల్పించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా సందర్శించారు. ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టతను గురించి వివరించారు.

బీఆర్‌ఎస్‌కు ఇక వీఆర్‌ఎస్సే

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు/బిజినేపల్లి: బీఆర్‌ఎస్ పార్టీకి ఇక వీఆర్‌ఎస్ తీసుకోక తప్పదని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమకారులనే కాదు.. ఉద్యమ పార్టీని కాలగర్భంలో కలిపిన చరిత్ర కేసీఆర్‌దే అన్నారు. బీఆర్‌ఎస్ మార్పుతో కేసీఆర్ శకం ముగిసినట్లేనని ఎద్దేవ చేశారు. 9ఏళ్ల రాష్ట్రంలో ప్రగతి పడకేసిందని ,పోలీసులతో సర్కార్‌ను నెట్టుకొస్తున్నారని చెప్పారు. అధికార పార్టీ నాయకుల అవినీతిపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను కేసుల పేరుతో వేధించడమే కాకుండా, భౌతిక దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర సాధనల్లో అమరుల త్యాగాలు వృథా అయ్యాయన్నారు. బీఆర్‌ఎస్ పతనం కందనూలు గడ్డ నుంచే ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈనెల 7వ తేదీ నుంచి శ్రీపురం నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రకు మద్దతుగా ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటానని, వారి జోలికొస్తే బీఆర్‌ఎస్ భరతం పడతానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బిజినేపల్లి మండలంలోని పాలెం, గుడ్లనర్వ, లట్టుపల్లి, ఖానాపూర్, మంగనూర్, గంగారం 150 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో నాగం జనార్దన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువ కప్పుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అరాచక పాలనకు మర్రి జనార్దన్‌రెడ్డి కేరాఫ్‌గా మారారని ఆరోపించారు. ఎన్నికల సమయంలోనే పెళ్లిళ్లు గుర్తొస్తాయా అని ప్రశ్నించారు. ఏ ఉద్దేశంతో సామూహిక పెళ్లిళ్లు చేస్తున్నావో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, బాలగౌడ్, పాండు, సుహాసన్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.